క్లుప్తంగా

మండల సర్వసభ్య సమావేశం నేడు

వెంకటగిరిరూరల్(బాలాయపల్లి): స్థానిక స్త్రీశక్తి భవనంలో శనివారం బాలాయపల్లి మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ స్వరూపారాణి తెలిపారు. బాలాయపల్లి ఎంపీపీ గూడూరు భాస్కర్‌రెడ్డి అధ్యక్షతన సమావేశం ఉంటుందన్నారు. వేసవిలో తాగునీటి సమస్యల పరిష్కారం, గ్రామాల్లో మౌళిక వసతుల కల్పన తదితర అంశాలపై చర్చ జరుగుతుందని తెలిపారు. మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

పెరటి కోళ్లు పంపిణీ

సైదాపురం: మండలంలోని అనంతమడుగు, పాలూరు గ్రామాలకు చెందిన మహిళలు, దివ్యాంగులకు ఐసీఐసీఐ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం పెరటికోళ్లు పంపిణీ చేశారు. ఫౌండేషన్ అధికారి శ్రీనివాసరావు మాట్లాడు తూ.. ఒంటరి మహిళలతో పాటు దివ్యాంగులైన వారి జీవనోపాధి మెరుగునకు పెరటి కోళ్లను ఉచితంగా అందజేసినట్లు తెలిపారు. ఎంపీటీసీ సభ్యులు ఈశ్వరరాజు, వెంకటరమణయ్య పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతులకు రూ.17 లక్షలు



గూడలి-విద్యానగర్ రోడ్డులో జరుగుతున్న మరమ్మతు పనులు

కోట: మండలంలో దెబ్బతిన్న రోడ్ల మరమ్మతు పనులు వేగంగా జరుగుతున్నాయి. గూడలి నుంచి విద్యానగర్ వరకు గుంతలమయంగా ఉన్న ప్రధాన రహదారిలో మరమ్మతులు చేస్తున్నారు. దీని కోసం రూ.17 లక్షలు మంజూరైనట్లు ఆర్ అండ్‌బీ డీఈఈ అరుణమ్మ శుక్రవారం తెలిపారు. పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఇప్పటికే కోట క్రాస్ రోడ్డు నుంచి కోట బజారువీధి మీదుగా కొక్కుపాడు రోడ్డు వరకు రూ.20 లక్షలతో రోడ్డు మరమ్మతులు చేస్తున్నట్లు చెప్పారు.

విద్యార్థులకు విజయదీపికలు పంపిణీ

చిల్లకూరు: ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా విజయదీపికల పుస్తకాలను శుక్రవారం పంపిణీ చేశారు. వరగలి జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శివసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ.. అన్ని ప్రభుత్వ పాఠశాలలకు తెలుగు, ఇంగ్లిష్ మీడియంలో పుస్తకాలు అందజేస్తున్నారని తెలిపారు.

ఎన్‌బీకేఆర్ జట్టుకు అభినందన



జట్టును అభినందిస్తున్న కళాశాల డైరెక్టర్

కోట: తెనాలిలో ఈ నెల 22వ తేదీ జరిగిన సాక్షి ప్రీమియర్ లీగ్ ప్రాంతీయ స్థాయి క్రికెట్ పోటీల్లో విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఐఎస్టీ జట్టు రన్నర్స్‌గా నిలిచిందని కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. ఈ మేరకు జట్టు సభ్యులను కళాశాలలో అభినందించారు. పీడీ మల్లికార్జున్‌రెడ్డి పాల్గొన్నారు.

వేలం పాటలో ఆదాయం

రాపూరు: పెంచలకోన దేవస్థానంలో శుక్రవారం నిర్వహించిన వేలంపాటల్లో పెద్ద మొత్తంలో రాబడి వచ్చినట్టు ఏసీ జనార్దన్‌రెడ్డి తెలిపారు. దేవస్థానంలో ఏప్రిల్ 1 నుంచి వచ్చే ఏడాది మార్చి 31 వరకు వస్త్రాలు విక్రయించుకునే హక్కుకు రూ.10 లక్షల నాలుగు వేలు, చెప్పులు భద్రపరుచుకునే హక్కు రూ.3 లక్షల 92 వేలు వచ్చినట్లు వెల్లడించారు. టెంకాయలు, పూజా ద్రవ్యాలు విక్రయించుకోనేందుకు, కొబ్బరి చిప్పలు పోగుచేసుకోనేందుకు, టోల్‌గేట్ రుసుము వసూలు తదితర వాటికి సరైన పాట రాకపోవడంతో వాటిని మార్చి 10వ తేదీకి వాయిదా వేసినట్లు ఆయన వెల్లడించారు.

వృద్ధాశ్రమానికి ఫ్యాన్‌లు వితరణ

గూడూరు: పట్టణంలోని సాయిరాం చారిటీస్ వృద్ధాశ్రమానికి ఫ్యాన్‌లు, దుప్పట్లు, చీరలను దాత విష్ణువర్ధన్ శుక్రవారం అందజేశారు. అనంతరం వృద్ధులకు అన్నదానం చేశారు. .

శభాష్ చిట్టిబాబు

చిల్లకూరు: గుండెపోటుకు గురైన వ్యక్తికి సపర్యలు చేసి సకాలంలో వైద్య చికిత్స అందేలా చేశారో కానిస్టేబుల్. చెన్నై నుంచి హైదరాబాద్‌కు కారులో వెళుతున్న భారతీరాజాకు కోట క్రాస్ రోడ్డు వద్ద గుండెపోటు వచ్చింది. విధుల్లో ఉన్న కానిస్టేబుల్ చిట్టిబాబు గుర్తించి వెంటనే 108కి సమాచారం ఇచ్చాడు. వైద్య సిబ్బంది వచ్చే వరకు సపర్యలు చేశారు. 108 సిబ్బంది గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కానిస్టేబుల్‌ను ఎస్‌ఐ అభినందించారు.

నగదు స్వాహాపై విచారణ

వాకాడు: మండలంలోని జెమిన్ కొత్తపాళెం పంచాయతీ గంగన్నపాళెంలో పొదుపు గ్రూపు సభ్యులు కట్టిన రూ. 12.43 లక్షలు స్వాహా చేశారన్న ఆరోపణలపై శుక్రవారం ఏపీడీఓ ప్రభావతి విచారణ చేశారు. స్థానిక వైఎస్సార్ క్రాంతి పథకం కార్యాలయంలో ఏపీఎం వెంకటరావు, సీసీలతో మాట్లాడారు. గ్రూపు సభ్యులు కట్టిన నగదు బ్యాంకులో జమకాకుండా వీఓఏ స్వాహా చేసినట్లు.. మరో గ్రూపులో కూడా రూ. 4.75 లక్షలు స్వాహా చేసినట్లు తెలుస్తోందని తెలిపారు. గడువులోగా చెల్లించకుంటే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ధాన్యం.. ధరానందం

- కనీస మద్దతు ధర కంటే మిన్నగా మార్కెట్ రేటు
- ప్రభుత్వ జోక్యంతో రైతులకు అదనపు ఆదాయం
- అన్నదాతల్లో ఆనందం



వెంకటగిరిలో కోతకు సిద్ధంగా ఉన్న వరి



కలపాడు వద్ద ధాన్యం కొనుగోలు చేసి లారీకి లోడ్ చేయిస్తున్న వ్యాపారి

వెంకటగిరి: కనీస మద్దతు ధర లభించక ఏ ఒక్క రైతు కూడా నష్టపోకూడదని రాష్ట్ర ప్రభుత్వం మూడేన్నరేళ్లుగా తీసుకున్న చర్యలు సత్ఫలితాలనిస్తున్నాయి. దళారీలు మాయాజాలంతో ధాన్యం ధరలు తగ్గించి కొనుగోలు చేసే ప్రతిసారీ ఆర్‌బీకేల ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేయడం ద్వారా వ్యాపారులు కూడా అదే ధరకు కొనాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. అయితే ఈ ఏడాది బియ్యం ధరలకు రెక్కలు రావడంతో ధాన్యం ధరలు కనీస మద్దతు ధరకు మించి కళ్లాల్లోనే క్యాష్ అండ్ క్యారీ విధానంలో వ్యాపారులు పోటీపడి కొనుగోలు చేస్తుండడం అన్నదాతల ఆనందానికి అవధుల్లేకుండా ఉంది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పడిన మూడన్నరేళ్లపైగా వరుణుడు కరుణించి సమృద్ధిగా వర్షాలు పడుతుండడంతో జిల్లాలో సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. జిల్లాలో 97,935 హెక్టార్లు సాధారణ సాగువిస్తీర్ణం కాగా వెంకటగిరి నియోజకవర్గంలోనే 12 వేలు హెక్టార్లపైగా ఉంటుందని అంచనా. గత ఏడాది వర్షాలు సమృద్ధిగా కురవడంతో రబీ, ఖరీఫ్ సీజన్‌లో సైతం రైతులు వరిసాగు చేశారు. నియోజకవర్గంలో ప్రధానంగా నెల్లూరు మసూర (ఎన్ఎల్ఆ ఔ34449) షుగర్‌లెస్ (ఆర్ఎన్ఆర్ 15048), ఐఐఆర్ఆర్ 93ఆర్ రకాలు ఎక్కువగా సాగు చేశారు.

ఆశాజనకంగా దిగుబడులు.. ధరలు

నియోజకవర్గంలో వెంకటగిరి, డక్కిలి, బాలాయపల్లి మండలాల్లో ముందస్తు రబీ సీజన్‌లో సాగు చేసిన వరికోతలు ప్రారంభమయ్యాయి. మరో వారం రోజుల్లో మిగిలిన అన్ని ప్రాంతాల్లో వరి కోతలు ముమ్మరం కానున్నాయి. రబీ సీజన్‌లో ఎకరాకు 35 నుంచి 40 బస్తాల దిగబడులు వస్తుండడంతోపాటు ధరలు ఆశాజనకంగా ఉన్నాయి. ఆర్బీకేల ద్వారా ధాన్యం కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తుండడంతో వ్యాపారులు పోటీపడి కళ్లాల్లోనే నగదు ఇచ్చి కొనుగోలు చేస్తున్నారు. మార్కెట్‌లో బియ్యం ధరలకు రెక్కలు రావడంతో వ్యాపారుల మధ్య పోటీనెలకొని కనీస మద్దతు ధర కంటే ఎక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. ఆర్ఎన్ఆర్ రకం ధాన్యం ఏ గ్రేడ్‌కు ప్రభుత్వం అందించే కనీస మద్దతు ధర రూ.2,060 లెక్కన బస్తా (80 కేజీలకు) రూ.1,648 రైతులకు అందుతుంది. అయితే ప్రస్తుతం బస్తా (80 కేజీలు) రూ.1,750కు వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. మిగిలిన రకాలు కనీస మద్దతు ధర కంటే తక్కువ కాకుండా అమ్మకాలు సాగిస్తున్నారు. ప్రభుత్వ చర్యల కారణంగా దళారుల ప్రమేయం చాలావరకూ తగ్గడంతో మిల్లర్లు నేరుగా రైతుల వద్దే కొనుగోలు చేస్తున్నారు. గతంలో ధాన్యం కొనుగోలు చేసిన నెల తర్వాత గాని నగదు రైతులకు ఇచ్చేవారు కాదు. ప్రస్తుతం ఆ పరిస్థితులు లేకపోవడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ధరలు, దిగుబడులు ఆశాజనకంగా ఉండడంతో ఈ ఏడాది వరిసాగు లాభదాయకంగా ఉందని రైతుల్లో ఆనందం వ్యక్తం అవుతుంది.

వరి గిట్టుబాటు అయ్యింది..



ఈ ఏడాది రబీ సీజన్‌లో వరిసాగు గిట్టుబాటు అయింది. నాలుగు ఎకరాలు సాగు చేస్తే 160 బస్తాలకు పైగా దిగుబడి వచ్చింది. ధరలు ఆశాజనకంగా ఉన్నాయి. దీంతో పెట్టుబడులు పోనూ లాభాలు వచ్చాయి. దళారీల ప్రమేయం లేకుండా వ్యాపారులు కళ్లాల్లోనే నగదు ఇచ్చి ధాన్యం కొనుగోలు చేయడం నా అనుభవంలో ఇదే తొలిసారి.

– పాముూరు గోపాల్, రైతు, కొత్తనాలపాడు, డక్కిలి మండలం

ముగిసిన మహాకుంభాభిషేకం



శిఖర కలశాలకు పూజలు చేస్తున్న వేమిరెడ్డి దంపతులు



ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, సుభాషిణి దంపతులు

సూళ్లూరుపేట: పట్టణంలో వెలసిన శ్రీచెంగాళమ్మ పరమేశ్వరి ఆలయంలో మహాకుంభాభిషేక మహోత్సవాలు శుక్రవారం ముగిశాయి. రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి–ప్రశాంతి దంపతులు పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆస్థాన మండపంలో మూడురోజులు నిర్వహించిన లక్షకుంకుమార్చన కార్యక్రమం శుక్రవారం మధ్యాహ్నం ముగిసింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, చైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి, ఈఓ ఆళ్ల శ్రీనివాసులురెడ్డి దంపతులు పాల్గొన్నారు. డిప్యూటీ సీఎం నారాయణస్వామి అమ్మవారిని దర్శించుకున్నారు. అన్నదానం చేశారు. మున్సిపల్ చైర్మన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి, పట్టణ పార్టీ అధ్యక్షులు శేఖర్‌రెడ్డి, పాలకమండలి సభ్యులు చంద్రశేఖర్‌రెడ్డి, దినేష్‌కుమార్, సురేష్‌కుమార్, సునీత, పద్మజ, మారెమ్మ, నాగమణి, సత్యనారాయణ పాల్గొన్నారు.

రాపూరులో సంబరాలు



సంబరాలు చేసుకుంటున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రాపూరు: స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి మేరిగ మురళీధర్ నామినేషన్ ఒక్కటే మిగలడంతో ఆయన ఎన్నిక ఏకగ్రీవం కానుంది. అయితే అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో రాపూరులో వైఎస్సార్‌సీపీ నాయకులు శుక్రవారం సంబరాలు చేసుకున్నారు. స్థానిక మూడురోడ్ల కూడలిలో బాణాసంచాపేల్చి మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ దందోలు నారాయణరెడ్డి, నాయకులు విశ్వనాథ్‌రెడ్డి, సుబ్బారెడ్డి, వెంకటేశ్వర్లు, రమణయ్య, ప్రకాష్‌రెడ్డి, మురళీమోహన్‌రెడ్డి, సుబ్బయ్య, గంగిశెట్టి వెంకటేశ్వర్లు, కలపాటి మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

కష్టపడేవారికి తగిన గుర్తింపు



సురేష్‌రెడ్డి, శివకుమార్‌ను సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

వెంకటగిరి: వైఎస్సార్‌సీపీ పార్టీ బలోపేతానికి అంకితభావంతో పనిచేసేవారికి పార్టీలో తగిన గుర్తింపు వస్తుందని వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ ఢిల్లీబాబు అన్నారు. స్థానిక నేదురుమల్లి బంగ్లాలో శుక్రవారం వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు నెమళ్లపూడి సురేష్‌రెడ్డి, చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు కాసుల శివకుమార్‌లను పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు సత్కరించారు. పార్టీ ఆవిర్భావం నుంచి నెమళ్లపూడి సురేష్‌రెడ్డి వెంకటగిరి నియోజకవర్గంలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. కాసుల శివకుమార్ సైతం చేనేత వర్గాల్లో మంచి పట్టు ఉన్న నేత అని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ యువజన విభాగం నాయకులు తోట గణేష్‌రెడ్డి, నాగరాజు, పేచీరాజ్ పాల్గొన్నారు.

సంఘాలను వినియోగించుకోండి



వెలుగు కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న డీఆర్‌డీఏ ఏపీడీ ప్రభావతి

ఓజిలి: రైతు ఉత్పత్తిదారులు సంఘాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీఏ ఏపీడీ ప్రభావతి అన్నారు. మండల వెలుగు కార్యాలయాన్ని శుక్రవారం ఆమె పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ స్త్రీనిధి రుణాలు రూ.16 కోట్లు నిధులను సంఘ సభ్యులకు మంజూరు చేశామన్నారు. స్త్రీనిధి రుణాలు రికవరీ 99 శాతం చేయడంతో ఏపీఎంను అభినందించారు. రైతు ఉత్పత్తిదారులు సంఘాలకు రుణాలు, వ్యవసాయపరికరాలు, ఎరువులు, పురుగుమందులు అందిస్తున్నామని తెలిపారు. కురుగొండ గ్రామంలో షేడ్‌నెట్ ద్వారా కూరగాయల సాగుపై అవగాహన కల్పించారు. అనంతరం వెలుగు కార్యాలయంలో పలు రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో డీపీఎంలు సింగన్న, ఆదినారాయణ, విజయ్‌కుమార్, ఏపీఎం నిర్మలమ్మ, సీసీ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలకు కట్టుదిట్టమైన భద్రత

నాయుడుపేటటౌన్ : ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి సూళ్లూరుపేట డివిజన్ పరిధిలోని పోలింగ్ కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రత చర్యలు చేపడుతున్నట్లు ఆర్డీవో చంద్రముని తెలిపారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను శుక్రవారం ఆర్డీవో పరిశీలించారు. పాఠశాలలో ఐదు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. కేంద్రాల్లో వసతులను పరిశీలించి అధికారులకు ఆర్డీఓ పలు సూచనలు చేశారు. ఆయన వెంట రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది ఉన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

పెళ్లకూరు: ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి స్థానిక పోలింగ్ కేంద్రాలను ఆర్డీవో చంద్రముని శుక్రవారం పరిశీలించారు. విద్యా వనరుల కేంద్రం, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేయాలని మండల అధికారులను ఆదేశించారు. ఆయన వెంట ఇన్‌చార్జ్ తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంఈవో సుబ్రమణ్యం, సిబ్బంది ఉన్నారు.

ఓజిలి: ఎమ్మెల్సీ ఎన్నికలకు సబంధించిన ఓజిలిలోని పోలింగ్ కేంద్రాలను సూళ్లూరుపేట ఆర్డీఓ చంద్రముని శుక్రవారం పరిశీలించారు. ఓజిలిలోని తహసీల్దార్ కార్యాలయం, మండల విద్యావనరుల కేంద్రాల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు, సలహాలను అందించారు. ఎన్నికల సమయంలో అప్రమత్తంగా వ్యవహరించాలని తెలిపారు. ఈయన వెంట తహసీల్దార్ లాజరస్, ఎంపీడీఓ రజనీకాంత్, ఎంఈఓ శైలజ తదితరులు ఉన్నారు.

తహసీల్దార్‌కు వినతి

ఓజిలి: ఎన్నో ఏళ్లుగా సాగుచేసుకుంటున్న భూములకు భూ పంపిణీలో పట్టాలు మంజూరు చేయాలని మాచవరం గ్రామపంచాయతీ సర్పంచ్ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నేత పిండుకూరు మధుసూదన్‌రెడ్డి తహసీల్దార్ లాజరస్‌కు శుక్రవారం వినతిపత్రం అందించారు. ముమ్మాయపాళెం గ్రామసమీపంలోని 16 ఎకరాల్లో కొంతమంది అనర్హులైన దళితులను అడ్డుపెట్టుకుని భూపంపిణీలో దక్కించుకోవాలని అధికారులు చుట్టూ తిరుగుతున్నారని తహసీల్దార్‌కు విన్నవించారు. పెదపరియ గ్రామంలో సర్వే నంబర్ 38-9బీలో 1.29 ఎకరాలు భూమికి హద్దులు చూపాలని గాడితోట పవన్‌కుమార్ తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు.

ఆటో, ద్విచక్ర వాహనం ఢీ

– ఒకరి మృతి

రాపూరు: రాపూరు మండలం, రావిగుంటపల్లి వద్ద శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరో ఇద్దరు గాయపడిన ఘటన స్థానికంగా విషాదాన్ని నింపింది. పోలీసుల కథనం.. రాపూరు మండలం, నవాబుపేట గ్రామానికి చెందిన గిలకపాటి రాజేష్ (27) గూడూరు నుంచి రాపూరుకు టీవీఎస్ స్కూటర్‌లో బయలుదేరాడు. అదేసమయంలో సైదాపురం మండలం, కృష్ణారెడ్డిపల్లికి చెందిన ఆటో రావిగుంటపల్లి వద్ద వస్తూ టీవీఎస్‌ను ఢీకొట్టింది. దీంతో రాజేష్ అక్కడికక్కడే మృతిచెందాడు. ఆటోలో ఉన్న మల్లేశ్వరి, దేవదానమ్మకు స్వల్పగాయాలయ్యాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ క్రాంతికుమార్ తెలిపారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు పటిష్ట చర్యలు

–ఆర్డీఓ కిరణ్‌కుమార్

గూడూరు: త్వరలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆర్డీఓ కిరణ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం తన కార్యాలయంలో డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి, డివిజన్ పరిధిలోని తహసీల్దార్‌లు, పోలీసులతో సమీక్షించారు. మార్చి13వ తేదీ జరగనున్న ఉపాధ్యాయుల, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఇతర విషయాలపై చర్చించారు. గూడూరు, తిరుపతి నియోజకవర్గాల పరిధిలో మొత్తం 20,187 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. పట్టభద్రులకు 22, ఉపాధ్యాయులకు 8 పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేస్తున్నామన్నారు. అర్బన్ సీఐలు హజరత్‌బాబు, వెంకటేశ్వరరావు, రామారావు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

ఒకటి నుంచి చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలు

కలువాయి: మండలంలోని కుల్లూరులో వెలసిన చెన్నకేశవస్వామి ఆలయంలో మార్చి 1వ తేదీ నుంచి బ్రహ్మోత్సవాలు జరుగుతాయని నిర్వాహకులు మాదాసు గంగాధరం, నళినమ్మ దంపతులు శుక్రవారం తెలిపారు. బ్రహ్మోత్సవాలకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు

విద్యార్థుల సామర్థ్యాల పరిశీలన

కలువాయి: పెన్నబద్దెవోలు ప్రాథమికోన్నత పాఠశాలను జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి సుధీర్‌బాబు శుక్రవారం తనిఖీ చేశారు. పాఠశాలలో అమలవుతున్న వివిధ కార్యక్రమాలు, బైజూస్ ట్యాబుల పనితీరు, విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. ఉపాధ్యాయిని నిజమాల లక్ష్మిని సత్కరించారు.

మద్యం విక్రేత అరెస్టు

చిల్లకూరు: సంతలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసి అతని నుంచి 31 బాటిళ్ల మద్యం స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని ముత్యాలపాడు పంచాయతీ పరిధిలోని ఏఎంసీ గోదాముల వద్ద ప్రతి శుక్రవారం గొర్రెల సంత జరుగుతుంది. నెల్లూరు జిల్లా మనుబోలు మండలం కటువపల్లికి చెందిన కస్తూరయ్య మద్యం బాటిళ్లను తీసుకుచ్చి అధిక ధరలకు విక్రయించాడు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ గోపాల్ నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు.

ప్రభుత్వ భూముల్లో హెచ్చరిక బోర్డులు

చిల్లకూరు: తూర్పుకనుపూరులో ఉన్న ప్రభుత్వ భూముల్లో రెవెన్యూ అధికారులు శుక్రవారం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఇది ప్రభుత్వ భూమి అని, ఎవరైనా అక్రమంగా ప్రవేశించినా, కట్టడాలు నిర్మించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వీఆర్వో రామచంద్రయ్య తెలిపారు.

వ్యక్తిపై కత్తితో దాడి

నాయుడుపేటటౌన్ : పట్టణ పరిధిలోని చంద్రబాబు కాలనీలో చిన్నపాటి గొడవలో వ్యక్తిపై కత్తితో దాడి చేసిన సంఘటన శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు, కాలనీకి చెందిన కిరణ్ కుమార్తె ఇంటి సమీపంలో ఉన్న ఇసుక గుట్ట వద్ద ఆడుకుంటుండగా అక్కడ ఉండే విజయకుమార్ గొడవ పడ్డాడు. ఈ విషయమై అడిగేందుకు వెళ్లిన కిరణ్‌ను కత్తితో పొడిచి తీవ్రంగా గాయపరిచాడు. వెంటనే కిరణ్‌ను స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కూరగాయల మార్కెట్ పనులు వేగవంతం



వ్యాపారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు

గూడూరు: వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాకే కూరగాయల మార్కెట్, రైతు బజారును నిర్మించామని ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు తెలిపారు. పట్టణంలోని ఐసీఎస్ రోడ్డులో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన చేపల మార్కెట్‌ను ఆయన శుక్రవారం పరిశీలించారు. చేపల వ్యాపారులతో మాట్లాడారు. కూరగాయల మార్కెట్ ప్రాంతంలోనే చేపల మార్కెట్ కూడా ఏర్పాటు చేయాలని వారు ఎమ్మెల్యేని కోరారు. చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. పార్టీ అధికారంలోకి రాగానే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రైతు బజారుకు నిధులు మంజూరు చేయలని కోరిన వెంటనే రూ 1.15 కోట్లు మంజూరు చేశారన్నారు. దీంతో అధునాతనంగా, అన్ని వసతులతో రైతు బజారు నిర్మాణాన్ని పూర్తి చేశామన్నారు. కూరగాయల మార్కెట్ నిర్మాణం త్వరలో పూర్తి కానుందన్నారు. అలాగే రూ.23 కోట్లతో ఏరియా ఆస్పత్రి ఆవరణలో అదనపు గదుల నిర్మాణ పనులు జరుగుతున్నాయని తెలిపారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలి

–జెడ్పీటీసీ సభ్యురాలు కలిమిలి రాజేశ్వరి



మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యురాలు రాజేశ్వరి

డక్కిలి: రానున్న వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని జెడ్పీటీసీ సభ్యురాలు కలిమిలి రాజేశ్వరి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గోను రాజశేఖర్ అధ్యక్షతన మండల సాధారణ సర్వసభ్య సమావేశం శుక్రవారం జరిగింది. జెడ్పీటీసీ మాట్లాడుతూ.. మండలంలోని అన్ని గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు లేకుండా ముందుస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ఎంపీపీ రాజశేఖర్ మాట్లాడుతూ.. నడికుడి–శ్రీకాళహస్తి రైల్వే లైన్ పనుల్లో భూములు కోల్పోతున్న రైతులకు న్యాయం చేయాలని కోరారు. మాధవయ్యపాళెం, దేవులపల్లి, వెంబులూరు, కమ్మపల్లి మీదుగా గతంలో బస్సు సౌకర్యం ఉండేదని.. ప్రస్తుతం బస్సును నిలిపివేయడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురతున్నారని తెలిపారు. అధికారులు బస్సును పునరుద్ధరించాలని మాధవయ్యపాళెం సొసైటీ అధ్యక్షుడు నర్రావుల వేణుగోపాల్‌నాయుడు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. తహసీల్దార్ రమేష్‌బాబు మాట్లాడుతూ.. అన్ని గ్రామాల్లో పదో తరగతి, ఇంటర్ విద్యార్థుల వివరాలను యాప్‌లో ఎన్‌రోల్ చేస్తున్నామన్నారు. ఎన్‌రోల్ చేసుకున్న విద్యార్థులకు కుల, ఆధాయ ధృవీకరణ పత్రాలు అందజేస్తామని తెలిపారు. ఉద్యానవన, వ్యవసాయశాఖ వీఏఏలు అందుబాటులో ఉండడం లేదని పలువురు ఆరోపించారు. మండల ఉపాధ్యక్షుడు గడ్డం చంద్రశేఖర్‌రెడ్డి, మండల ప్రత్యేకాధికారి వెంకటరాము, ఎంపీడీఓ కోటేశ్వరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ నాగరాజు, పీఆర్‌ఏఈ చంద్రశేఖర్, ఆర్‌అండ్‌బీ ఏఈఈ బాబు, ఎంఈఓ వెంకటేశ్వర్లు, నర్రావుల ప్రకాశంనాయుడు, భాస్కర్‌నాయుడు పాల్గొన్నారు.

ర్యాగింగ్‌తో జీవితాలను నాశనం చేసుకోవద్దు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ

రాపూరు: ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్‌లకు పాల్పడడం నేరమని సీఐ కోటేశ్వరరావు అన్నారు. రాపూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం ర్యాగింగ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థులతో స్నేహభావంతో నడుచుకోవాలన్నారు. ర్యాగింగ్‌తో ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ వెంకట్‌నాయక్, ఎస్‌ఐ క్రాంతికుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఒకటిన ఎన్నికల శిక్షణ తరగతులు

నాయుడుపేటటౌన్: పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి మార్చి 1న నాయుడుపేట పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పోలింగ్ అధికారులకు శిక్షణ తరగతులను నిర్వహించనున్నట్లు తహసీల్దార్ రాజేంద్ర శుక్రవారం తెలిపారు. కలెక్టర్ వెంకటరమణా రెడ్డి, సూళ్లూరుపేట ఆర్డీఓ చంద్రముని ఆదేశాల మేరకు నాయుడుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని సమావేశ మందిరాన్ని పరిశీలన చేసినట్లు తెలిపారు. సూళ్లూరుపేట, గూడూరు డివిజన్ పరిధిలోని పోలింగ్ కేంద్రాల్లో విధులను నిర్వహించే ఎన్నికల అధికారులకు ఉదయం10 గంటల నుంచి సాయంత్రం వరకు ఒక రోజు శిక్షణ ఇస్తున్నట్లు వెల్లడించారు.

వారి సేవలు అభినందనీయం

గూడూరు: సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తున్న సీఆర్‌రెడ్డి కుటుంబం సేవలు అభినందనీయమని మున్సిపల్ కమిషనర్ సాయినాథ్ అన్నారు. మున్సిపాల్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సీఆర్‌రెడ్డి రోటరీ సందర్శకుల నిరీక్షణ నిలయాన్ని శుక్రవారం ప్రారంభించారు. సురేంద్రరెడ్డి, జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.

CHANGE OF NAME

I MUMMAREDDY PRABHAKARA REDDY (Old Name) S/o M. Balakrishna Reddy Residing Kurugonda Village, Ozili Mandal, SPSR Nellore Dt. Changed My Name as MUMMAREDDY PRABHAKAR REDDY (New Name)

అద్దె భవనము కావలెను

సబ్ రిజిస్ట్రార్ ఆఫీసు నాయుడుపేట కొరకు 2000 చదరపు అడుగులు పైబడిన RCC అద్దె భవనము కావలెను.

సంప్రదించవలసిన చిరునామా

ఇట్లు : సబ్‌రిజిస్ట్రారు - నాయుడుపేట

తిరుపతి జిల్లా, సెల్ : 70939 21602

ఖండన ప్రకటన

తేది 20-02-2023 రోజున సాక్షి దినపత్రిక తిరుపతిజిల్లా గూడూరు జోన్‌లో 9వ పేజీ నందు శ్రీ కోలగిరిశ్రీధర్ అడ్వకేట్ గారు వారి క్లయింట్లు అగు 1) చెన్నూరు సుబ్బరామిరెడ్డి తండ్రి రామరాఘవ రెడ్డి గారి తరఫున తిరుపతి జిల్లా నాయుడుపేట టౌన్, 3వ వార్డు, 11వ బ్లాకు శ్రీకాళహస్తి బైపాస్ రోడ్డుకు దక్షిణం వైపున గల అమరావతి హోటల్ & లాడ్జి కొత్తగా వేయబడిన డోర్ నెం. 4-1-200 దులో గల 4 అంతస్తుల భవనము యొక్క విషయములో యిచ్చిన అభ్యంతర ప్రకటనకు మరియు అదే రోజున ఈనాడు దినపత్రిక తిరుపతి జిల్లా గూడూరు జోన్‌లో 5వ పేజీ నందు శ్రీ కోలగిరి శ్రీధర్, అడ్వకేట్ గారు వారి క్లయింట్లు అగు 1) చెన్నూరు సుబ్బరామిరెడ్డి తండ్రి రామరాఘవ రెడ్డి గారి తరఫున తిరుపతి జిల్లా నాయుడుపేట టౌన్, 3వ వార్డు, 11వ బ్లాకు శ్రీకాళహస్తి బైపాస్ రోడ్డుకు దక్షిణం వైపున గల అమరావతి హోటల్ & లాడ్జి క్రొత్తగా వేయబడిన డోర్ నెం. 4-1-200 దులో గల 4 అంతస్తుల భవనము యొక్క విషయములో యిచ్చిన ఖండన ప్రకటనలకు నా క్లయింట్స్ అగు నాయుడుపేట కాపురస్తులయిన అయిన 1) చెన్నూరు సురేఖ 2) చెన్నూరు డింపుల్ రెడ్డి 3) చెన్నూరు నిఖిత రెడ్డి గార్ల తరఫున ఇచ్చు ఖండన ప్రకటన.

యావన్మందికి తెలియజేయడం ఏమనగా పైన చూపబడిన ఆస్తి శ్రీ చెన్నూరు సుధాకర్‌రెడ్డి తండ్రి రాధాక్రిష్ణారెడ్డి గారికి చెందినది. సదరు ఆస్తిలో శ్రీ చెన్నూరు సుధాకర్‌రెడ్డి తండ్రి రాధాక్రిష్ణారెడ్డి గారు సంపూర్ణ హక్కు అనుభవంలతో అనుభవించుకొంటు జీవించేవారు. పై ఆస్తికి సంబంధించి శ్రీ చెన్నూరు సుధాకర్‌రెడ్డి తండ్రి రాధాక్రిష్ణారెడ్డి గారికి తప్ప ఇతరులకు ఎలాంటి హక్కు అధికారం లేదు. తదుపరి లోగడ తేది 06-04-2016 దిన సదరు శ్రీ చెన్నూరు సుధాకర్‌రెడ్డి తండ్రి రాధాక్రిష్ణారెడ్డి గతించినందున పై ఆస్తికి వారసులు అయిన 1) చెన్నూరు సురేఖ 2) చెన్నూరు డింపుల్ రెడ్డి 3) చెన్నూరు నిఖిత రెడ్డి గార్లకు సంక్రమించినది. పై వార్లు సదరు ఆస్తిని 1) ఇప్పగుంట వెంకటసుబ్బారెడ్డి 2) ఇప్పగుంట సంధ్య 3) పోతిరెడ్డి లావణ్య 4) కోదూరు అనూష గార్లకు విక్రయించెయ్యదలచి, విక్రయ అగ్రిమెంటు వ్రాసియిచ్చినారు. తదుపరి తేది: 15-02-2023 రోజున ఈనాడు దినపత్రిక తిరుపతి జిల్లా గూడూరు జోన్‌లో 7వ పేజీ నందు శ్రీ వరలవాడ కుమార్, అడ్వకేట్ నాయుడుపేట గారు వారి క్లయింట్లు అయిన 1) ఇప్పగుంట వెంకటసుబ్బారెడ్డి 2) ఇప్పగుంట సంధ్య 3) పోతిరెడ్డి లావణ్య 4) కోదూరు అనూష గార్ల తరఫున ఇచ్చిన బహిరంగ ప్రకటన ఆధారంగా చేసుకొని సదరు ఆస్తిని విక్రయించుటకు వీలులేదని సదరు ఆస్తిని శ్రీ చెన్నూరు సుధాకర్‌రెడ్డి తండ్రి రాధాక్రిష్ణారెడ్డి గారు లోగడ తేది 09-09-2015 రోజున రూ.45,00,000/-లు అక్షరములా నలభై ఐదు లక్షలు అప్పుగా తీసుకొని అస్వాధీన అదుమాన అప్పు పత్రమును చెన్నూరు సుబ్బరామి రెడ్డికి అమరావతి హోటల్ & లాడ్జి బిల్డింగును తనఖా పెట్టియున్నారని, సదరు అసలు రూపాయలకు గాను వంద రూపాయలకు నెలకు రూ.100/-లు అక్షరములా ఒక్క రూపాయి వడ్డీ లెక్కన ప్రతి నెలా చెల్లించి,అసలు, వడ్డీని కలిపి సదరు చెన్నూరు సుబ్బరామిరెడ్డి గారికి చెల్లించి సదరు అస్వాధీన అదుమాన అప్పు పత్రమును రద్దు పరుచుకోగలనని వ్రాసియిచ్చియున్నారని, వ్రాసి ఇచ్చిన విధముగానే తేది 09-09-2015 నుండి చెన్నూరు సుధాకర్‌రెడ్డి గారున్నూ మరియు వారి భార్య అయిన శ్రీమతి చెన్నూరు సురేఖ గార్లు కొంతకాలము వరకు వడ్డీని చెల్లించినారని. దరిమిలా చెన్నూరు సుధాకర్ రెడ్డి వారసులు అయిన 1) చెన్నూరు సురేఖ 2) చెన్నూరు డింపుల్ రెడ్డి 3) చెన్నూరు నిఖిత రెడ్డి గార్లు కొంత కాలముగా అసలు మరియు వడ్డీని చెల్లించుటలో విఫలమైనారని. దరిమిలా చెన్నూరు సుధాకర్ రెడ్డి వారసులు అయిన 1) చెన్నూరు సురేఖ 2) చెన్నూరు డింపుల్ రెడ్డి 3) చెన్నూరు నిఖిత రెడ్డి గార్లు కలిసి గార్లు చెన్నూరు సుబ్బరామిరెడ్డి గారిని మోసంచేసినారని, తనఖా వుంచబడిన ఆస్తి అనగా అమరావతి హోటల్ & లాడ్జి బిల్డింగును ఇతరులకు విక్రయించుచున్నారని మరియు ఎవరైనా గాని ఎలాంటి లావాదేవీలు క్రయ విక్రయములు చెన్నూరు సుబ్బరామిరెడ్డి గారికి తెలియకుండా చేయరాదని, అట్లు లావాదేవీలు జరిపిన అవి చట్ట రీత్యా చెల్లనేరవని మరియు చెన్నూరు సుబ్బరామిరెడ్డి తీసుకొనే చట్టపరమైన చర్యలకు బాధ్యులగుదురని తేది: 20-02-2023 రోజున సాక్షి దినపత్రిక తిరుపతి జిల్లా గూడూరు జోన్‌లో 9వ పేజీ నందు మరియు అదే రోజున ఈనాడు దినపత్రిక తిరుపతి జిల్లా గూడూరు జోన్లో 5వ పేజీ నందు వచ్చిన ప్రకటనల ద్వారా తెలిసింది.

కానీ సదరు ఆస్తిపై చెన్నూరు సుధాకర్ రెడ్డి వారసులు అయిన 1) చెన్నూరు సురేఖ 2) చెన్నూరు డింపుల్ రెడ్డి 3) చెన్నూరు నిఖిత రెడ్డి గార్లకు తప్ప ఇతరులకు ఎవ్వరికీ ఎటువంటి హక్కు అధికారం లేదు. నా క్లయింట్స్ అయిన చెన్నూరు సుధాకర్ రెడ్డి గారు కానీ మరియు 1) చెన్నూరు సురేఖ 2) చెన్నూరు డింపుల్ రెడ్డి 3) చెన్నూరు నిఖిత రెడ్డి గార్లు ఎవ్వరు ఎవ్వరికి ఎటువంటి ప్రామిసరీనోటుగా ఎటువంటి పత్రములు వ్రాసిఇవ్వలేదు. పైన తెలిపిన తేది: 20-02-2023 రోజున సాక్షి దినపత్రిక తిరుపతి జిల్లా గూడూరు జోన్‌లో 9వ పేజీ నందు మరియు అదే రోజున ఈనాడు దినపత్రిక తిరుపతి జిల్లా గూడూరు జోన్‌లో 5వ పేజీ నందు వచ్చిన ప్రకటనలు అన్నీ కల్పితాలు. అందులో ఎటువంటి వాస్తవాలు లేవు. కావున సదరు ఆస్తిని విక్రయించుటకు నా క్లయింట్స్ అయిన 1) చెన్నూరు సురేఖ 2) చెన్నూరు డింపుల్ రెడ్డి 3) చెన్నూరు నిఖిత రెడ్డి గార్లకు పూర్తి హక్కులు కలవు. ఇక పై సదరు ఆస్తికి సంబంధించి ఎటువంటి అవాంఛనీయ, ఆరోపణలు విధముగా నా క్లయింట్స్‌కు మరియు నా క్లయింట్స్ ఆస్తికి పరువుకు భంగం కలిగించే విధముగా ప్రస్తుతము చేసిన,చేయబోతున్న ప్రకటనలపై నా క్లయింట్స్ తీసుకొనే చట్టపరమైన పరువునష్టం దావాలు, సివిల్ మరియు క్రిమినల్ చర్యలకు బాధ్యులగుదురు.

ఆస్తి షెడ్యూల్

తిరుపతి జిల్లా, నాయుడుపేట Town , 3వ వార్డు 11వ బ్లాకు, శ్రీకాళహస్తి బైపాస్ రోడ్డునకు దక్షిణంగా గల అమరావతి హోటల్ Door No New 4-1-200లో గల 4 అంతస్తుల భవనమునకు హద్దులు.East: 12 అడుగుల నాయుడుపేట Municipality Road, West: షేక్ గౌస్ మొహిద్దీన్ ఇల్లు, North: శ్రీకాళహస్తి బైపాస్‌రోడ్డు, South: అబ్దుల్ సత్తార్ ఇల్లు.

A. KIRAN KUMAR., MCA.,LL.B., Advocate, Naidupet, Ph: 9493075341.